ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

5

శుక్రవారం 30 ఆగస్టు 2024



భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 27.0

తేమ : 34.0 - 26.0

అయితే మాకేంటి ?

- మంత్రి పార్థసారఽథి హెచ్చరించినా.. నూజివీడు ట్రిపుల్ ఐటీలో అదే భోజనం
- ఉడకని ఉప్మా, గుడ్లు.. తినలేక వదిలేసిన విద్యార్థులు
- తండ్రిగా నేనైతే నిర్వాహకులను కొట్టి అడిగేవాడిని
- భోజనం రుచి చూసి మంత్రి ఆగ్రహం
- కొనసాగుతున్న జ్వరాలు.. మరో 80 మందికి చికిత్స



వంటలు రుచి చూస్తున్న మంత్రి పార్థసారథి



భోజనం ఎలా వుందో విద్యార్థులను అడుగుతున్న జనసేన నాయకులు

'మీ బిడ్డలకు ఇదే రీతిన ఆహారం అందిస్తారా ? నా పిల్లలు ఇక్కడ చదువుతుంటే, ఒక తండ్రిగా కొట్టి మరీ వెళ్ళేవాడిని' అని నూజివీడు ట్రిపుల్ ఐటీ మెస్ నిర్వాహకులపై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇక నుంచి నాణ్యమైన భోజనం అందజేయాలని గురువారం రాత్రి రెండు గంటల వరకు ఐఐఐటీ అధికారుల, మెస్ నిర్వాహకులతో సమీక్షించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయితే మాకేంటి అనుకున్నారో ఏమో.. మెస్ మెస్ నిర్వాహకులు విద్యార్థులకు అదే నాణ్యత లేని భోజనం, ఉడకని ఉప్మా, గుడ్లను శుక్రవారం అందించారు. వీటిని తినలేక విద్యార్థులు చాలామంది వదిలేశారు. మరోవైపు జ్వరాల తీవ్రత తగ్గలేదు. ఈ రోజు 80 మందికి చికిత్స చేశారు. మెయిన్‌లో

శ్రీవారి నిత్యార్జిత కల్యాణ సేవ రుసుం పెంపు

ద్వారకాతిరుమల, ఆగస్టు 29: శ్రీవారి నిత్యార్జిత కల్యాణ సేవా టికెట్టు రుసుమును రూ.1,500 నుంచి రూ.2 వేలకు పెంచుతూ దేవస్థానం నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఇది అమలులోకి వస్తుందని ఆలయ ఈవో త్రినాథరావు తెలిపారు. పెరిగిన రుసుముకు అనుగుణంగా టికెట్టు తీసుకున్న వారికి అదనంగా ఇచ్చే సౌకర్యా లు ఏమీ లేవు. కొన్నాళ్ల క్రితం అష్టోత్తరంతోపాటు మరికొన్ని ఆర్జిత సేవా టికెట్ల రుసుమును పెంచడంతో సామాన్య భక్తులు ఆవేదన చెందుతున్నారు.



ఇక.. ప్రభుత్వపరంగా వాసవీ ఆత్మార్పణ దినం

ఆర్యవైశ్య సంఘాల కోరిక మేరకు క్యాబినెట్ నిర్ణయం.. సర్వత్రా హర్షం

పెనుగొండ క్షేత్రం మరింత అభివృద్ధి

7

రొయ్యలు అధరహో !

పెరిగిన ధరలు..

ఊపందుకున్నసాగు

లాభాల బాటలో రైతులు



కలిదిండి, ఆగస్టు 29 : రొయ్యల ధరలు పెరిగాయి. వైసీపీ పాలనలో గిట్టుబాటు ధర లేక కుదేలైన ఆక్వా రంగానికి ఎన్డీఏ ప్రభుత్వం రాకతో మంచి రోజులు వచ్చాయి. గతంలో పెట్టుబడి వ్యయం పెరిగి రొయ్య ధర పతనమవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వేల ఎకరాల సాగు పెరిగింది. ప్రస్తుతం 100 కౌంటు రొయ్య ధర రూ.260, 90 కౌంటు రూ.270, 80 కౌంటు రూ.280, 70 కౌంటు రూ.300, 60 కౌంటు రూ.320, 50 కౌంటు రూ.340, 30 కౌంటు రూ.470 వరకు పెరిగింది. 100 కౌంటుకు గతంలో పోలిస్తే రూ.80 పెరిగింది. మంచి ధర లభించడంతో రైతులు 100 కౌంటు రొయ్యలను పట్టుబడి చేస్తున్నారు. 'వాతావరణంలో మార్పులతో వైరస్ వ్యాప్తి, ఆక్సిజన్ కొరత సమస్యలతో సాగు దెబ్బతింది. ప్రస్తుతం రొయ్యకు గిట్టుబాటు ధర ఉన్నప్పటికీ అందుకు తగ్గ ఉత్పత్తి లేదు. దీంతో రొయ్య ధర పెరిగింది. రాబోయే రోజుల్లో గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంది' అంటూ వ్యాపారి వి.సత్యనారాయణ పేర్కొన్నారు.

పోలవరం పురోగతిపై పరిశీలన



ప్రాజెక్టు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

పోలవరం ఆగస్టు 29 : పోలవరం ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయడమే ధ్యేయంగా ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పని చేస్తున్నారని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. గురువారం పోలవరం ప్రాజెక్టు వద్దకు కూటమి నాయకులతో చేరుకున్న ఆయన ప్రాజెక్టులో పనుల పురోగతిని సంబంధిత ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు అతిథి గృహం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలవరం నిర్మాణం కోసం రూ.12,500 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఆర్అండ్ఆర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పార్లమెంటులో, శాసన సభలో మంత్రుల సమావేశంలో కూటమి నేతలు చర్చించారని తెలిపారు. పైడిపాక నిర్వాసితులు తమకు ఆర్అండ్ఆర్ పరిహారాలు అందలేదని ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు కరిబండి నాగరాజు, బొరగం వెంకటలక్ష్మి, కామిశెట్టి నాగరాజు, జనసేన నాయకులు కొణతాల ప్రసాద్, పాదం కృష్ణ, తెలగంశెట్టి రాము పాల్గొన్నారు.



లక్ష్మణేశ్వరంలోని ఆక్వా కాలేజ్

ఆక్వా తరగతులు ఎక్కడ..?

- ఆక్వా యునివర్సిటిపై మల్లగుల్లాలు
- తొలి ఏడాది తరగతులు తుఫాన్‌షెడ్‌లలోనే..
- మౌలిక వసతులు లేవంటూ విద్యార్థుల ఆందోళన
- ఈసారి తరగతులపై తర్జనభర్జన
- ఉండి కృషివిజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుకు సన్నాహాలు
- ఉభయగోదావరిజిల్లాలు ఆక్వారంగానికి ప్రసిద్ధి

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

గోదావరి జిల్లాల్లో ఆక్వా యూనివర్శిటీ ఏర్పాటు చెయ్యాలన్న డిమాండ్ నేపథ్యంలో చివరకు వైసీపీ హయాంలో నరసాపురం కేంద్రంగా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. భూములు కేటాయించారు. గత ఏడాది నుంచి తగరతులు నిర్వహిస్తున్నారు. తీర ప్రాంతంలో ఉన్న తుఫాన్ భవనంలో తరగతులు ఏర్పాటు చేశారు. 60 మందికి అడ్మిషన్‌లు కల్పించారు. ఏడాదిపాటు తరగతులను అందులోనే ఏర్పాటు చేశారు. ఈఏడాది మరో 60 మందికి అడ్మిషన్‌లు కల్పించనున్నారు. అయితే తుఫాన్ షెడ్‌లలో వసతులు లేవని కూటమి ప్రభుత్వం గుర్తించింది. నరసాపురంలో అద్దె భవనాల కోసం ఇటీవల అధికారులు ప్రయత్నాలు చేశారు. పట్టణంలో పరిశీలించారు. పట్టణంలో అనువైన భవనాలు లభ్యం కాలేదు. దాంతో ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు సన్నహాలు చేస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో తరగతులు నిర్వహిస్తే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు. ఉండి కేవీకేలో ప్రధానంగా మత్స్యపరిశోధన నిర్వహిస్తూ ఉంటారు. పిల్లపెంపకం నుంచి పట్టుబడి దాకా కేవీకేలో పరిశోధనలు, ప్రయోగాలు జరుగుతున్నాయి. ఇది కూడా విద్యార్థుల్లో ఆక్వారంగంపై ప్రయోగాత్మక విజ్ఞానాన్ని అందించటానికి ఉపయోగపడనుంది. అందు కోసమే తాత్కాలిక తరగతులకు ఉండి కృషి విజ్ఞాన కేంద్రం అనువుగా ఉంటుందని నిర్ణయించారు.

యూనివర్శిటి ఎక్కడ..?

వాస్తవానికి 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం భీమవరం ప్రాంతంలో ఆక్వా విశ్వవిద్యాలయం ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించింది. అప్పట్లో ఆచరణ సాధ్యం కాలేదు. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. నరసాపురంలో ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంది. ఆ దిశగా చర్యలు చేపట్టింది. తీరం ప్రాంతంలో చెరువులు, ప్రయోగ శాలలు ఏర్పాటుచెయ్యటానికి భూముని గుర్తించింది కానీ కళాశాల ఏర్పాటు చెయ్యలేకపోయింది. కనీసం తరగతులు కూడా నిర్వహించలేదు. గత ఏడాది తుఫాన్ షెడ్‌లో తరగతులు ప్రారంభించినప్పటికీ సరైన వసతులులేక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆక్వా విశ్వవిద్యాలయం రెండో బ్యాచి అడ్మిషన్‌లు కల్పించాలి. కృషి విజ్ఞాన కేంద్రంలో తరగతులు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ వైద్యకళాశాలను నరసాపురంలో ఏర్పాటుచేసేందుకు వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. అక్కడ భూములు అనుకూలంగా లేవని నిపుణులు నిర్ధారించారు. దాంతో పాలకొల్లు నియోజకవర్గనానికి మెడికల్ కళాశాలను తరలించారు. ఇప్పుడు ఆక్వా విశ్వవిద్యాలయంలోను తాత్కలిక తరగతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ తరుణంలో తరగతుల కోసం ఉండి కృషి విజ్ఞాకేంద్రాన్ని ఎంపిక చేశారు. ఫలితంగా విశ్వవిద్యాలయం కూడా ఎక్కడ ఏర్పాటు అవుతుందనే దానిపై మళ్ళీ అనుమానాలు వ్యక్తం అవుతన్నాయి. అధికారులు మాత్రం తాత్కాలిక తరగతులకు మాత్రమే కృషివిజ్ఞాన కేంద్రం వినియోగిస్తామని, శాశ్వత క్యాంప్ ఏర్పాటు చేసి నరసాపురానికి తరలిస్తామన్నారు.



గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

వార్షిక రుణ ప్రణాళికకు ఆమోదం

భీమవరం టౌన్, ఆగస్టు 29: అన్ని వర్గాల ప్రజల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకర్లు విరివిగా రుణాలు అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు గురువారం కలెక్టరేట్‌లో జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. అనంతరం 2024-25 వార్షిక రుణ ప్రణాళిక అమలు, స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు, కౌలుదారులకు రుణాలు, పశు కిసాన్ క్రెడిట్ కార్డ్స్ రుణాలు మంజూరు, ఎస్‌హెచ్‌జీలకు రుణాలు, చేనేత కార్మికులకు ముద్ర రుణాలు అమలు తదితర అంశాలపై బ్యాంకర్ల సమావేశంలో సమీక్షించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా వార్షిక రుణ ప్రణాళికను రూ.24,003 కోట్లతో ప్రవేశపెట్టడం జరిగిందని, దీనిలో రూ.20,473 కోట్లు ప్రాధాన్యత రంగాలకు కేటాయించినట్టు తెలిపారు. ప్రాధాన్యేతర రంగాలకు రూ.3,530 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు అర్హతను బట్టి విద్యాలక్ష్మి పథకం కింద రూ.7.50 లక్షల వరకు రుణాలను మంజూరు చేయాలన్నారు. చేనేత కార్మికులకు మార్జిన్ మనీ వెంటనే విడుదల చేయాలన్నారు, గత సమావేశంలో కూడా ఈ విషయమై చర్చించడం జరిగిందని, నేటి వరకు మార్జిన్ మనీ ఎందుకు విడుదల కాలేదని బ్యాంకర్లను ప్రశ్నించారు. అలాగే చేనేత కార్మికులకు లక్ష్యం మేరకు ముద్ర రుణాలను మంజూరు చేయాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఏ.నాగేంద్ర ప్రసాద్, ఆర్బీఐ ఏజీఎం ఆర్.కె.హనుమ కుమారి, రీజనల్ హెడ్ యుబీఐ వి.సంగీత కుమారి పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవం

తెలుగుభాష కమ్మదనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని, తెలుగు భాషను ప్రేమిస్తే మన అమ్మను గౌరవించినట్లేనని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో తెలుగు అధికార భాషా దినోత్సవం, జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి, భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తెలుగు భాషలోనే మన సంస్కృతి, సంప్రదాయాలు మిళితమై ఉన్నాయన్నారు.

ఆర్బీఐ ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు ఆహ్వానం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీలను కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కోరారు. గురువారం కలెక్టరేట్‌లో బ్యాంకర్స్ సమావేశంలో క్విజ్ పోటీల గోడ ప్రతిని జేసీ ఆవిష్కరించారు. ఒక కళాశాల నుంచి ఎంతమంది విద్యార్థులైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ఒక టీమ్‌గా ఏర్పడి క్విజ్ పోటీలలో రిజిస్టర్ చేసుకోవాలని అన్నారు.

జోనల్ రౌండ్‌లో మొదటి బహుమతి రూ.5లక్షలు, రెండో బహుతి రూ.4లక్షలు, మూడవ బహుమతి రూ.3లక్షలు, జాతీస్థాయి ఫైనల్ రౌండ్ మొదటి బహుమతి రూ.10లక్షలు, రెండో బహుమతి రూ.8లక్షలు, మూడవ బహుమతి రూ.6లక్షలు ఉంటాయని వివరించారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఏ.నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సిద్ధాంతం ఇసుక ర్యాంప్ వద్దకు విచ్చేసిన ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు

ఇసుక ర్యాంపులపై విచారణ

పెనుగొండ/ఆచంట, ఆగస్టు 29: ప్రభుత్వ ఆదేశాలు మేరకు 2021 నుంచి 2024 వరకు వివిధ ఇసుక ర్యాంప్‌లలో జరిగిన తవ్వకాలపై విచారణకు వచ్చినట్లు ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు తెలిపారు. గురువారం ఆచంట నియోజకవర్గంలో కోడేరు, కరుగోరుమిల్లి, పెనుగొండ మండలంలో సిద్ధాంతం, నడిపూడి ఇసుక ర్యాంప్‌లను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఇసుక తవ్వకాలలో నిబంధనలు ప్రకారం తవ్వకాలు జరిపారా, వాహనాలకు ఏ విధమైన వసూళ్ళు జరిగాయని స్థానిక వీఆర్‌వోలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట వెజిలెన్స్ సీఐ బాస్కరరావు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఒక రోజు ముందే పింఛన్లు

- ఒక రోజు ముందే పంపిణీకి సన్నాహాలు
- జిల్లాలో మొత్తం పింఛన్‌దారులు 2,31,075మంది
- రూ.96కోట్ల 96 లక్షలు అందించనున్న ప్రభుత్వం

భీమవరం టౌన్, ఆగస్టు 29 : జిల్లాలో పింఛన్లను ఈసారి ఒకరోజు ముందే లబ్ధిదారులకు అందిస్తారు. సామాజిక పింఛన్ పథకం ప్రవేశపెట్టిన తరువాత 1వ తేదీకి ముందు అందించటం అనేది ఇదే మొదటిసారి. గతంలో 1వ తేదీన సెలవు వస్తే ఆనెలలో తరువాత రోజున పెన్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకునేవారు. కూటమి ప్రభుత్వం మాత్రం వినూత్నంగా ఒకరోజు ముందుగానే పింఛన్ అందించేలా ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు రావటంతో ఏర్పాట్లను చకచక చేస్తున్నారు. ఈసారి జిల్లాలో చనిపొయిన వారు 770 మంది ఉన్నారు. వారిని తీసివేసి 2లక్షల 31వేల 075 మందికి రూ.96 కోట్ల96 లక్షలు పంపిణీ చెయ్యనున్నారు. ఇందుకోసం 4,428 మంది సిబ్బందిని వినియోగించనున్నారు. వీరితోపాటుగా పింఛన్ల పంపిణీ పరిశీలనకు కమిషనర్లు ఎంపీడీవోలు, తహసీల్దార్లతోపాటు ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని కూడా నియమించారు. శుక్రవారంనాడు సచివాలయాలవారీగా నగదును అందించనున్నారు. 31వ తేదీన ఉదయం 6 గంటల నుంచి పింఛన్ పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. నూరుశాతం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 31వ తేదీన పింఛన్ తీసుకోని వారికి సెప్టెంబరు 2వ తేదీన ఇస్తారని అధికారులు చెబుతున్నారు.

ఈనెల 31వ తేదీనే ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదల వాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే



అంటే ఈనెల 31వ తేదీన పెన్షన్ల పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. అదే రోజు నూరు శాతం పింఛన్లు పంపిణీకి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ, మున్సిపల్ కమిషనర్లు, లీడ్ బ్యాంక్ మేనేజర్, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి, తదితరులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలనీ, ఎక్కడ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలనీ చెప్పారు. మొదటి రోజే వంద శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యంగా చేసుకుని పనిచేయాలని సూచించారు. పింఛను లబ్ధిదారులు సిబ్బందికి అందుబాటులో ఉండాలని కోరారు.

మండలం	లబ్ధిదారులు	నగదు(కోట్లలో)
ఆచంట	8158	3.41
ఆకివీడు	5426	2.27
ఆకివీడు(అర్బన్)	3259	1.37
అత్తిలి	9593	4.01
భీమవరం	11404	4.71
భీమవరం(అర్బన్)	11243	4.84
గణపవరం	8784	3.75
ఇరగవరం	9472	3.97
కాళ్ళ	8906	3.74
మొగల్తూరు	10693	4.41
నరసాపురం(అర్బన్)	5737	2.45
నరసాపురం	11158	4.63
పాలకొల్లు	9144	3.84
పాలకోడేరు	9241	3.74
పాలకొల్లు(అర్బన్)	5929	2.54
పెంటపాడు	9853	4.22
పెనుగొండ	8814	3.65
పెనుమంట్ర	8356	3.48
పోడూరు	8633	3.68
తాడేపల్లిగూడెం	12582	5.25
గూడెం(అర్బన్)	9297	4.00
తణుకు	8964	3.74
తణుకు(అర్బన్)	8509	3.69
ఉండి	8876	3.66
వీరవాసరం	8640	3.64
యలమంచిలి	10404	4.26
	2,31,075	96.96

వన మహోత్సవానికి వనరులేవీ

మూడేళ్లుగా ఏకో క్లబ్‌లకు నిధులు నిలిపివేత..

నేషనల్ గ్రీన్‌కోర్ క్లబ్‌లు నిర్వీర్యం

గతంలో జిల్లాలో సామాజిక అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పట్టణాలు, గ్రామాల్లో నిర్వహించే నర్సరీ నుంచి వన మహోత్సవం, తదితర సామాజిక పర్యావరణ కార్యక్రమాలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేసేవారు. ఇపుడు చాలాచోట్ల నర్సరీలు లేవు. దీంతో జిల్లాలోని 250 హైస్కూళ్ల ప్రాంగణాలు, స్థానిక ఖాళీ ప్రదేశాల్లో శుక్ర, శనివారాల్లో మొక్కలు నాటడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



ఏలూరు అర్బన్, ఆగస్టు 29 : పచ్చని మొక్కలను నాటడం ద్వారా శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు పాఠశాలలు, వాటి ప్రాంగణాలు, ఖాళీ స్థలాల్లో 'వన మహోత్సవం' పేరిట నిర్వహించ తలపెట్టిన బృహత్తర కార్యక్రమానికి ఒక్క రూపాయి కూడా విదల్చకుండా జరపాల్సి రావడంపై ఉపాధ్యాయ వర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నానాటికీ తగ్గిపోతున్న అటవీ సంపదను, పచ్చదనాన్ని కాపాడుకోవడం ద్వారా పర్యా వరణ సమతుల్యత లక్ష్యంగా వన మహోత్సవాన్ని ఉద్దేశించగా, మూడేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఈ కార్యక్ర మాన్ని అటకెక్కించడం వల్ల దాదాపు కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది. తాజాగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ వన మహోత్సవానికి కార్యాచరణను చేపట్టింది. మొక్కల సేకరణ, వాటిని పాఠశాలలకు తరలించడం, నాటడానికి అయ్యే కనీస ఖర్చులకు నిధులు విడుదల చేయకపోవడం గమ నార్హం. గతంలో టీడీపీ ప్రభుత్వం పచ్చదనం, పర్యావ రణ పరిరక్షణలపై విద్యార్థులను భాగస్వాములుగా చేస్తూ అన్ని పాఠశాలల్లో నేషనల్ గ్రీన్ కోర్ (ఎన్జీసీ) ఆధ్వర్యంలో ఎకో క్లబ్‌లను ఏర్పాటుచేసింది. వీటికి కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ నుంచి ఒక్కో స్కూలు ఎకో క్లబ్‌కు ఏటా రూ.5 వేలు బ్యాంకు ఖాతాకు జమ చేసేవారు. ఈ నిధులతోనే ఏడాది పొడవునా స్కూలు లో నీటి సంరక్షణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ, మొక్కలు నాటడం, విద్యుత్ వృథాను అరికట్టడం వంటి బాధ్య తలతో ఆరు రకాల క్లబ్‌లను విద్యార్థులతో ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లాలో 250 ప్రభుత్వ హైస్కూళ్లలో ఎకో క్లబ్‌లు వుండగా, జిల్లాస్థాయిలో ఎన్జీసీ కార్యకలా పాల నిర్వహణ, పర్యవేక్షణ నిమిత్తం ఓ కో-ఆర్డినేటర్, మరో పది మంది బయోలాజికల్ సైన్స్ టీచర్లు ఉన్నా రు. వీరికి ఏటా పారితోషకంగా రూ.25 వేలు చెల్లిస్తుం డగా, గత జగన్ ప్రభుత్వం మూడేళ్ళగా నిలిపివేసింది. ఆ మేరకు ఎటువంటి బడ్జెట్ నిధులు లేకుండానే ప్లాం టేషన్ కార్యక్రమాలను నిర్వహించడానికి టీచర్లు ఆసక్తి కనబరచడం లేదు. ఒకవేళ ఈ కార్యక్రమాలను నిర్వహించి బిల్లులు పెట్టుకున్నా నిధులు రాకపోవడం తో మొక్కలు నాటే కార్యక్రమాలు పూర్తిగా మూలనప డ్డాయి. మరోవైపు జిల్లావ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించడానికి, వాటిని పర్యవేక్షించడా నికి టీచర్లకు ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని ఇవ్వకపోవడంతో ఎన్జీసీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. వనమహో త్సవం నిర్వహణ నిమిత్తం గురువారం సాయంత్రం వరకు నిధులేవీ విడుదల కాలేదని ఎన్జీసీకి చెందిన ఓ ఉపాధ్యాయుడు వివరించారు. స్కూలు విధులు ముగిసిన తర్వాత మొక్కల కోసం ప్రయత్నించాల్సి ఉందని చెప్పడం కార్యక్రమ ఏర్పాట్లలో లొసుగులకు సంకేతమని భావించవచ్చు.

ఏలూరు జిల్లాలో లక్ష మొక్కలు నాటనున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్ర దామా తెలిపారు. నూజివీడులో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించ నున్న కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ పాల్గొంటున్నారని తెలిపారు.



ఏపీ నిట్‌లో క్రీడా దినోత్సవంలో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 29 : విద్యార్థులు చదువుతో పాటూ క్రీడల్లోనూ రాణించాలని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ టీఎస్ మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేశ్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిట్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. వీరేష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయని, విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ కిరణ్‌తీపర్తి మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడల్లో భారతదేశం తరుపున మూడుసార్లు బంగారు పతకాలను దేశానికి అందించిన హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. దేశభక్తిని, క్రీడాస్ఫూర్తిని చాటిచెప్పిన ధ్యానచంద్ తరతరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తున్నారని కొనియాడారు. తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆచార్యులు డాక్టర్ వీ.సందీప్, డాక్టర్ రాముడు, సాస్ అసిస్టెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


గొరగనమూడి జ్ఞానానంద హైస్కూల్ పీడీ, విద్యార్థులను సత్కరిస్తున్న జేసీ

స్వామి జ్ఞానానంద హైస్కూల్‌కు ఎక్సలెన్సీ అవార్డు

పాలకోడేరు, ఆగస్టు 29: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచిన గొరగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు లభించినట్లు ప్రధానోపాధ్యాయురాలు బీ.శ్రీదేవి తెలిపారు. వరుసగా రెండవ సంవత్సరం కూడా ఈ అవార్డు లభించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ఆర్‌జేడీ, జిల్లా విద్యాశాఖాధికారి నాగమణి చేతుల మీదుగా పీడీ విజయలక్ష్మి, విద్యార్థులు ఈ అవార్డు అందుకున్నారు. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు సాధించిన సర్టిఫికెట్స్, ప్రతిభా ఆధారంగా అవార్డు వచ్చినట్టు ఆమె తెలిపారు. దీనిలో భాగంగా పాలకోడేరు మండలానికి చెందిన శృంగవృక్షం హైస్కూల్‌కు ద్వితీయ స్థానం లభించిందని తెలిపారు. విద్యాకమిటీ ఛైర్మన్ పొన్నమండ బాలకృష్ణ, సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు, ఎంపీటీసీ పార్వతి కృష్ణకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపెడా అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్

అప్సడా అనుమతులు తప్పనిసరి

కాళ్ళ, ఆగస్టు 29 : ఆక్వాసాగు, ప్రాసెసింగ్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజీ, ఐస్ ప్లాంట్లు నిర్వాహకులు తప్పనిసరిగా అప్సడాలో రిజిస్ట్రేషన్ చేయించుకుని లైసెన్స్ పొందాలని ఎంపెడా అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్ తెలిపారు. కాళ్ళ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మత్స్యశాఖ, ఎంపెడా ఆధ్వర్యంలో ఏపీ ఎస్ఏడీఏ అనుమతులు, ఎంపెడా ఎన్‌రోల్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆనంద్‌కుమార్, ఉండి కేవీకే మత్స్యశాస్త్రజ్ఞులు డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు తెలిపారు. కాళ్ళ మండలంలో సుమారు 22,387 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోందన్నారు. ఇందులో 7,680 ఎకరాలు మాత్రమే అప్సడా నందు రిజిస్ట్రేషన్ జరిగాయని, ప్రాసెసింగ్ ప్లాంట్లు 6 ఉండగా 3, ఐస్ ప్లాంట్లు 15కి 5 రిజిస్ట్రేషన్ అయినట్లు తెలిపారు. అప్సడాలో రిజిస్ట్రేషన్ కలిగి లైసెన్స్ ఉంటేనే రానున్న రోజుల్లో విద్యుత్ సబ్సిడీ వస్తుందని తెలిపారు. ఆక్వా సాగు చేస్తున్న రైతులు వ్యర్థ జలాలను పంట కాలువల్లోకి వదిలితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌చార్జీ ఎఫ్‌డీవో రాంబాబు, మత్స్యశాఖ సిబ్బంది, ఆక్వా రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

బాలిక మృతిపై సీహెచ్‌సీలో విచారణ



ఆకివీడు, ఆగస్టు 29 :ఆకివీడు సీహెచ్‌సీలో దుంపగడపకు చెందిన బాలిక దుర్గలహరి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రులు,సీపీఎం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం ఆసుపత్రిలో డీసీహెచ్‌ఎస్ పి.సూర్యనారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ నజ్రీన్ సమక్షంలో ఎక్స్‌పర్ట్ టీమ్ వైద్యులు పాలకొల్లు, భీమవరం, ఆకివీడుకు చెందిన రవికుమార్, ఎస్.సాయికిరణ్మయి, భూపతిరాజు శివరామకృష్ణంరాజు డ్యూటీ డాక్టర్, స్టాఫ్‌నర్సులను, బాలిక తల్లిదండ్రులను విచారించారు. వైద్యం సక్రమంగానే అందించామని రాత్రి సమయంలో ఒక్కసారిగా బాలికకు తేడా రావడంతో ఏలూరు పంపామని సిబ్బంది తెలిపారు. సాయంత్రం వరకూ బాగానే ఉన్న బాలికకు ఒక్కసారిగా తేడా చేసిందంటే వైద్యుల నిర్లక్ష్యం కాకుండా ఏమౌతుందని ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందడం లేదని సీపీఎం జిల్లా నాయకుడు గోపాలన్ మండిపడ్డారు.

డీసీఎంఎస్‌కు పూర్వ వైభవం

ఐదేళ్లలో నిర్వీర్యమైన సహకార రంగం
భారీగా తగ్గిన వ్యాపార కార్యకలాపాలు
కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ ప్రోత్సాహం

ఏలూరుసిటీ, ఆగస్టు 28: సహకార రంగంలో ఘన చరిత్ర కలిగిన సంస్థ డీసీఎంఎస్. 1942 సంవత్సరంలో స్థాపించిన డీసీఎంఎస్ (డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) అంచెలంచెలుగా ఎదుగుతూ రైతులకు సేవలందిస్తూ తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 20 డీసీఎంఎస్ బ్రాంచిల ద్వారా సహకార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో డీసీఎంఎస్ వ్యాపారం గణనీయంగా తగ్గిందని చెబుతున్నారు. 2019 సంవత్సరానికి ముందు వరకు ఎరువుల వ్యాపారాన్ని డీసీఎంఎస్ విస్తృతంగా చేసేది. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుతో ప్రభుత్వం నుంచి డీసీఎంఎస్‌కు అందించే ఎరువుల వాటా తగ్గింది. గతంలో 100 శాతం వరకు ఎరువులు కేటాయించేవారు. ఆర్బీకేల ఏర్పాటుతో 15 నుంచి 20 శాతం మాత్రమే ఎరువుల సరఫరా జరిగింది. దీంతో బయట ప్రైవేటు మార్కెట్‌లో కొనుగోలు చేసి రైతులకు ఎరువులు అమ్మకాలు చేసింది. దీంతో డీసీఎంఎస్‌కు అదనపు భారం పడటమే కాకుండా వ్యాపారం కూడా గణనీయంగా పడిపోయింది.

గణనీయంగా పడిపోయిన వ్యాపారం

సహకార రంగంలో డీసీఎంఎస్ పాత్ర అద్వితీయం. రైతుల శ్రేయస్సుకోరి వివిధ వ్యాపారాలను డీసీఎంఎస్ ద్వారా నిర్వహిస్తున్నారు. ఏలూరులో డీసీఎంఎస్ జనరల్ స్టోర్సు ఏర్పాటు చేశారు. ఏలూరు, భీమవరం డీసీఎంఎస్ కేంద్రాలలో జనరిక్ మెడిసిన్ స్టోర్సు ఏర్పాటు చేశారు. ఏలూరులోని డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో విద్యార్థులకు అవసర మయ్యే స్టేషనరీ, పుస్తకాల అమ్మకాలు కూడా సాగిస్తున్నారు. జనరల్ స్టోర్సులో కార్పోరేట్ మాల్స్ మాదిరిగా అత్యంత తక్కువ ధరలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను ప్రజలను అందిస్తున్నారు. దీపావళి సమయంలో బాణసంచా వ్యాపారం ద్వారా లాభాలను ఆర్జిస్తున్నారు. డీసీఎంఎస్‌లో ఏటా రూ. 100 కోట్లుకు పైగా వ్యాపారం జరిగేది. ప్రధానంగా ఎరువుల అమ్మకాలే ఉండేవి. ఐదేళ్లుగా వ్యాపారం గణనీయంగా పడిపోయిందని చెబుతున్నారు. సుమారు రూ.60 కోట్లు మాత్రమే వ్యాపారం జరిగిందని చెబుతున్నారు. దాదాపు 40 కోట్ల వ్యాపారానికి గండి పడిందని చెప్పవచ్చు. డీసీఎంఎస్‌లో జరిగే మిగిలిన వ్యాపార కార్యకలాపాలకు తగిన ప్రోత్సాహం లేకపోవడంతో అక్కడ కూడా వ్యాపారాలు తగ్గాయని చెబుతున్నారు.



ఏలూరులోని సహకార సంఘ స్టోర్

మళ్లీ పూర్వ వైభవం

డీసీఎంఎస్‌లో పాలకవర్గం సొసైటీ సభ్యుల ఎన్నికల ద్వారానే నియామకం జరుగుతూ ఉంటుంది. పాలకవర్గాల సమయం పూర్తయితే ప్రత్యేక అధికారులను నియమించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే గత ప్రభుత్వం డీసీఎంఎస్ పాలకవర్గాలకు సంబంధించి పీఏసీ కమిటీలను నామినేటెడ్‌గా నియమించింది. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో డీసీఎంఎస్‌లో వ్యాపారం పుంజుకుంటుందనే చెబుతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా 100 శాతం ఎరువులు డీసీఎంఎస్‌కు సరఫరా అయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

ఇక.. ప్రభుత్వపరంగా వాసవీ ఆత్మార్పణ రోజు

క్యాబినెట్ నిర్ణయంపై సర్వత్రా హర్షం
పెనుగొండ క్షేత్రం మరింత అభివృద్ధి

ఆచంట, పెనుగొండ, ఆగస్టు 29 : పెనుగొండ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ చేసుకొన్న రోజును అధికారికంగా నిర్వహించాలని దేవ దాయ శాఖకు అప్పగిస్తూ రెండు రోజులు క్రితం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు నాలుగు వేల సంవత్సరాల క్రితం నగరేశ్వరస్వామి ఆలయంలో మహిషాసురమర్ధని అమ్మవారు స్వయంభూగా వెలిశారు. ఇదే ఆలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ చేసుకుంది. ప్రతీ సంవత్సరం మాఘ శుద్ధ విదియ రోజున ఆత్మార్పణ కార్యక్రమం నిర్వహిస్తారు.వచ్చే సంవత్సరం జనవరి 31న అమ్మవారి ఆత్మార్పణ రోజు. ఆత్మార్పణ రోజును ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంతో భక్తులు పెరిగే అవకాశం ఉంది.ఏప్రిల్, మే నెలలో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు.

ఇదీ చరిత్ర..

పెనుగొండలో కుసుమశ్రేష్టి, కుసుమాంబ అనే వైశ్య దంపతులకు వాసవి జన్మించింది. వాసవీ బాల్యం నుంచి శివ భక్తురాలు. ప్రతీ నిత్యం నగరేశ్వరస్వామి, మహిషాసురమర్ధని అమ్మవారిని ఆరాధించేది. విష్ణు వర్ధనుడు అనేరాజు ఉత్తరాది నుంచి దక్షిణాదికి వస్తూ పెనుగొండలో వాసవిని చూశాడు. ముగ్దుడై వివాహం చేసుకుంటానని మంత్రితో ఆమె తల్లిదండ్రుల వద్దకు పంపుతాడు. క్షత్రియులతో వైశ్యులకు వివాహం తగదని నిరాకరిస్తుంది. అయితే బలవంతంగానైనా వివాహం చేసుకుంటానని చెప్పి రాజు పెనుగొండకు బయలుదేరతాడు. వివాహం ఇష్టం లేని వాసవీ పెనుగొండ నగరేశ్వరస్వామి ఆలయంలో ప్రజల సమక్షంలో అగ్నిగుండం ఏర్పాటు చేసుకుని ఆత్మార్పణ చేసుకుంటుంది. ఇదే ఆలయంలో వాసవీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. చరిత్ర కలిగిన అమ్మవారు ఆర్యవైశ్యుల కులదైవంగా వర్ధిల్లుతూ పెనుగొండ క్షేత్రం ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చెందింది. మన రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కర్నాటక రాష్ట్రం నుంచి అనేక మంది ఆర్యవైశ్య సంఘ భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ప్రతీ శని, ఆదివారం రోజుల్లో ఇక్కడ ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి. ఇంత ప్రశిద్ధి చెందిన అమ్మవారికి సుమారు 50 ఎకరాలు పైగానే భూమితో పాటు సంవత్సరానికి రూ. 30 లక్షలు పైగానే ఆదాయం వస్తుంది. ఆలయం వద్ద ప్రతీరోజూ అన్నసమారాధన కూడా నిర్వహిస్తారు.



మంచి నిర్ణయమే..



వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆర్యవైశ్యుల కులదైవం. వేల సంవత్సరాల నుంచి అమ్మవారు ఇక్కడ స్వయంభూగా వెలవడంతో మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరచూ భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. అమ్మవారి ఆత్మార్పణ రోజును ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం మంచిదే.

కోట వెంకట సుబ్రహ్మణ్యం, ఆలయ పూజారి

దిశ పోలీస్ స్టేషన్ పేరు మార్పు

ఏలూరు క్రైం, ఆగస్టు 29 : రాష్ట్రంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా పోలీస్ స్టేషన్లను వైసీపీ ప్రభుత్వం దిశ పోలీస్ స్టేషన్‌గా మార్పు చేసింది. దిశ చట్టం అమలు చేస్తున్నట్లుగా ప్రజలను నమ్మించారు. వాస్తవానికి కేవలం చట్టాలు తయారు చేశారే కాని ఎలాంటి ఆమోదం చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాస్తవాలను ప్రజలకు తెలియజేసే విధంగా చర్యలు చేపట్టింది.దీనిలో భాగంగా మహిళల రక్షణకోసం ఏర్పాటు చేసిన మహిళా పోలీస్ స్టేషన్‌గా మార్పు చేసి గవర్నర్ ఆమోదానికి పంపించడంతో ఆయన ఈనెల 28వ తేదీన ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల్లోని దిశ పోలీస్‌స్టేషన్లను మహిళా పోలీస్ స్టేషన్లుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం నుంచే ఉత్తర్వులు అమలులోకి వచ్చాయి.

ఘాట్ రోడ్డు అంచనా వేయలేం


మ్యాప్ పరిశీలిస్తున్న ఈఈ

ఆగిరిపల్లి, ఆగస్టు 29: ఆగిరిపల్లి శోభనాచల లక్ష్మీ నరసింహస్వామి కొండ పైకి ఘాట్ రోడ్డు అంచనా కోసం మంత్రి పార్థసారథి పంచాయతీ రాజ్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాపిరెడ్డిని పంపించారు. అర్‌అండ్‌బీ ఇంజినీర్లు గాని, విజయవాడ దుర్గామల్లీశ్వర స్వామి దేవస్థానం ఇంజినీర్లు గానీ పరిశీలించాలని తమకైతే రెండు సంవత్సరాలు వ్యవధి పడు తుందని బాపిరెడ్డి తెలిపారు. 2019లో దేవస్థానం కార్యదర్శి హైదరాబాద్ ఆర్కిటెక్ట్ మారుతీ కన్‌స్ట్రక్షన్ వారిచే సుమారు లక్ష రూపాయలు ఖర్చుపెట్టి ఘాట్ రోడ్డు మ్యాప్ వేయించారు. ఈ మ్యాప్ పరిశీలించి అంచనా వేయమని కోరగా పరిశీలిస్తామని తెలిపారు.

చైల్డ్‌కేర్ సంస్థల తనిఖీ చేసిన కమిటీ

ఏలూరు క్రైం, ఆగస్టు 29 : జిల్లాస్థాయి ఇన్‌స్పెక్షన్ కమిటీ ఏలూరు జిల్లాలో ఉన్న రిజిస్టర్డ్ చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూషన్స్, రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న ఎనిమిది చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్‌లో గురువారం తనిఖీలు నిర్వహించినట్టు డీసీపీవో సూర్యచక్రవేణి తెలిపారు. ఈ హోమ్‌లలో 18 సంవత్సరాల లోపు ఆశ్రయం పొందుతున్న బాలలకు అందిస్తున్న వసతి, ఇతర సదుపాయాలను పరిశీలించారు. నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎవరైనా ఆదరణ, సంరక్షణ అవసరం ఉన్నటువంటి బాలలకు వసతి గృహాలు నడుపుతున్నట్లయితే జువవైనల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్ నోడల్ ఆఫీసర్ చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూషన్ కన్వీనర్ దుర్గాప్రసాద్, కోకన్వీనర్ డాక్టర్ సూర్య చక్రవేణి,ఏలూరు ఐసీడీసీఎస్ ప్రాజెక్టు చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ పద్మావతి, ఇన్‌ట్యూషనల్ కేర్ ఆఫీసర్ సీహెచ్ శ్రీకాంత్ లీగల్ ప్రొబేషన్ ఆఫీసర్ జాహ్నవి పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల మధ్య గోధుమ తాచు



జంగారెడ్డిగూడెం, ఆగస్టు 29 :జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డు సమీపంలో చెరుకూరి శ్రీధర్ ఇంటి పక్కనే ఉన్న రాఘవరాజు నాగరాజు ఇంటి వద్ద ఉన్న పొగాకు బేళ్ళ మధ్య దాగి ఉన్న గోధుమ తాచు పాము బుసలు కొడుతూ కనిపించడంతో భయభ్రాంతులకు గుర య్యారు. స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతికుమార్‌కు సమాచార మివ్వగా ఆయన అక్కడకు వచ్చి పామును సురక్షితంగా పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు. ఎనిమిది అడుగుల పొడవున్న ఈ పాము అరుదైన విషపూరిత జాతికి చెందిందని తెలిపారు.


సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు అనివేటి మండపం వద్ద సిద్ధమైన వేదిక

క్షేత్రంలో నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 29: చినవెంకన్న క్షేత్రంలోని అనివేటి మండప ఆవరణలో శుక్రవారం జరుగనున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు దేవస్థానం ఏర్పాట్లు పూర్తి చేసింది. శ్రావణమాసంలో ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రత నిర్వహణకు వేదికను నిర్మించారు. అరటిబోదెలు, మామిడి తోరణాలుతో సర్వాంగసుందరంగా అలంకరించారు. వ్రతాలకు వచ్చేవారికి దేవస్థానం పసుపు, కుంకుమ, జాకెటుముక్క, కొబ్బరికాయ, ఇతర పూజాసామగ్రి అందజేస్తుందని కలశ పాత్రను తెచ్చుకోవాలని కోరుతున్నారు.

పరమ పవిత్రం..పవిత్రాధివాసం



ద్వారకాతిరుమల, ఆగస్టు 29: శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం వేణు గోపాల, జగన్నాథ వేంకటేశ్వర ఆలయంలో జరుగుతున్న దివ్య పవిత్రోత్స వాల్లో భాగంగా గురువారం పవిత్రాధి వాసం జరిగింది. ఆలయంలో ఏడాది పొడవునా తెలిసీ తెలియక జరిగిన తప్పుల ప్రాయఃచిత్తం నిమిత్తం ఈ పవిత్రోత్సవాలను నిర్వహిస్తారు. గురువారం ఉదయం ఆలయ యాగశాలలో పవిత్రాలను ఉంచి ముందుగా రుత్వికులు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. పంచగవ్యప్రోక్షణ జరిపి అగ్ని ప్రతిష్టాపన జరిపారు. అనంతరం పవిత్రాలకు పవిత్రాధివాసాన్ని ఆలయ అర్చ కులు, పండితులు వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలో మహాశాంతి హోమాన్ని జరిపారు.

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరుసిటీ, ఆగస్టు 29: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతుందని జడ్పీ సీఈవో సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థాయి సంఘాల ఎన్నిక, జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందని ఆయన వివరించారు.

సచివాలయ సిబ్బందికి బదిలీ కౌన్సెలింగ్

ఏలూరు టూటౌన్, ఆగస్టు 29: ఉమ్మడి జిల్లాలోని 8 మున్సిపాలిటీలు ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయాల కార్యదర్శులకు నగర పాలక సంస్థ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంజనీరింగ్, ఎడ్యూకేషన్, వెల్ఫేర్, అడ్మిన్, ప్లానింగ్, సెక్రటరీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. 128 మంది దరఖాస్తు చేసుకోగా 112 మంది కార్యదర్శులు హాజరయ్యారు. వీరందరికి కావల్సిన చోటుకు బదిలీ చేశారు. అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, మున్సిపల్ ఇంజనీర్ కొండల్రావు, ఏసీపీ తిరుపతిరావు,ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, పాల్గొన్నారు.

సిఫార్సు లెటర్లతో ఉద్యోగుల ప్రయత్నాలు

ముదినేపల్లి, ఆగస్టు 29 : గ్రామ సచివాలయాల ఉద్యోగులు తమ తొలి బదిలీ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రాతిపదికన బదిలీలు నిర్వహిస్తున్నందున ప్రస్తుతం ఏలూరు జిల్లాలో ఉన్న ముదినేపల్లి మండలం నుంచి ఎక్కువ శాతం సచివాలయ ఉద్యోగులు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు వెళ్లేందుకు ఆప్షన్లు ఇచ్చారు. మండలం నుంచి వంద మందికి పైగా బదిలీలకు దరఖాస్తులు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నాయకుల సిఫార్సుల లెటర్ల ఆధారంగా సచివాలయాల ఉద్యోగులు దరఖాస్తు చేశారు. గురువారం కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో బదిలీల దరఖాస్తుల పరిశీలన జరిగింది.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. మహిళ మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన దాట్ల దుర్గాదేవి

కైకలూరు ఆగస్టు 29: పామర్రు-కత్తిపూడి జాతీయ రహదారిలో ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొన్న సంఘటనలో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కైకలూరు మండలం శింగాపురంలో గురువారం ఈ ప్రమాద ఘటన చోటుచేసుకుంది. భీమవరం నుంచి ఏలూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు కైకలూరు నుంచి ఆకివీడు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ రహదారి గోతిని తప్పించబోయి ఆటోను పట్టించి కొద్ది దూరం ఈడ్చుకుపోయాడు. ఆటో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు ప్రయాణికులు ఆటోలో ప్రయాణిస్తున్నారు. ఆ ముగ్గురు పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం చెరుకుమిల్లి గ్రామానికి చెందిన దాట్ల విశ్వనాధరాజు, దాట్ల దుర్గాదేవి, దాట్ల అప్పలరాజు కైకలూరులో టైల్స్ కొనేందుకు వచ్చారు. వాటిని కొనుగోలు చేసి తిరిగి ఆటోలో వెళుతుండగా మార్గమధ్యలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో 108 ద్వారా స్థానికులు కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరి ముగ్గురిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి మెరుగైన చికిత్సకు పంపించగా అక్కడ చికిత్స పొందుతూ దుర్గాదేవి(63) మృతి చెందింది. ఆమె భర్త అయిన దాట్ల విశ్వనాధరాజు పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులకు వైద్యసహాయం అందించారు. ఈ సంఘటనపై మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయంలో చోరీకి యత్నం

పెంటపాడు, ఆగస్టు 29 : మండలంలోని బీ.కొండేపాడు సచివాలయంలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇవి. సచివాలయం తలుపులు పగులగొట్టి లోపలికి చొరబడి సర్పంచ్ , కార్యదర్శి బీరువా తలుపులు కూడా పగులకొట్టారు. బీరువాలో కాగితాలు అన్నీ చెల్లా చెదురుగా పడవేశారు. అయితే సామాగ్రి ఏదీ చోరీకి గురి కాలేదు.

విధులకు ఆటంకం.. కేసు నమోదు

తణుకు, ఆగస్టు 29 : విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ మూర్తి తెలిపారు. స్టేట్ సేల్స్ టాక్సు డిపార్టుమెంటులో పనిచేస్తున్న అబ్దుల్ అమీద్ బుధవారం రాత్రి తేతలి జాతీయ రహదారి వద్ద విధులు నిర్వహిస్తుండగా ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామానికి చెందిన మోపాటి సాయి సురేష్, మోపాటి శ్రీను, దుబా రామకృష్ణ దుర్గాప్రసాదు,గవర దుర్గాప్రసాదు, లంక ఉమా దుర్గారావులు గొడవపడి విధులకు ఆటంకం కలిగించినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని ఒకరి మృతి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 29 : గురవాయిగూడెం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దగ్గుమల్ల రామారావు (55) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన మృతుడు రామారావు తాపీ పని చేసుస్తుంటాడు. గురువారం మండలంలోని చక్రదేవరపల్లి గ్రామంలోని బంధువుల ఇంటి వద్ద జరిగిన పుట్టిన రోజు వేడుకకు హాజరయ్యాడు. అక్కడ నుంచి జంగారెడ్డిగూడెం పట్టణంలో ఉన్న తన చెల్లెలి ఇంటికి టీవీఎస్ ఎక్సెల్ సూపర్ ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. గురవాయిగూడెం దాటి సామిల్లు వద్దకు వచ్చేసరికి జంగారెడ్డిగూడెం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో రామారావు తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. జంగారెడ్డిగూడెం ఎస్సై జబీర్, లక్కవరం ఏఎస్సైలు ఘటనా స్థలానికి వెళ్ళి ట్రాఫిక్ అదుపు చేశారు. లారీను, లారీ డ్రైవరు అశోక్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గణపవరంలో ట్యాక్సీ ఢీకొని..

గణపవరం, ఆగస్టు 29: గణపవరం గ్రామానికి చెందిన దాసి వీరాస్వామి (75) ట్యాక్సీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై ఎస్.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో నడిచి వెళ్తున్న వీరాస్వామిని ట్యాక్సీ అతివేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయాడు. వీరాస్వామి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు.

భార్యపై భర్త కత్తితో దాడి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిర్మల

పెదవేగి, ఆగస్టు 29 : కుటుంబ కలహాల కారణంగా భార్యపై భర్త కత్తితో దాడిచేశాడు. తీవ్రగాయాలైన భార్యను స్థానికులు ఏలూరు ఆస్పత్రికి తరలించారు. పెదవేగి మండలం ముండూరుకు చెందిన భార్యాభర్తలు అనపా అచ్చియ్య నిర్మలకు ఇద్దరు పిల్లలు. కొంత కాలంగా ఆ ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. గురు వారం మధ్యాహ్నం సమయంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విచక్షణ కోల్పోయిన భర్త అచ్చియ్య కత్తితో భార్య నిర్మలపై దాడిచేసి గాయపర్చాడు. కాళ్ళకు, చేతులకు తీవ్ర గాయాలైన ఆమెను స్థానికులు ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు.

బ్లేడుతో మహిళపై దాడి



జంగారెడ్డిగూడెం, ఆగస్టు 29 : మహిళపై బ్లేడుతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జబీర్ తెలిపారు. పెదవేగి గ్రామానికి చెందిన చిగురుపల్లి సంధ్యారాణి తన భర్తతో విడిపోయింది. తనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో రెండు సంవత్స రాలుగా పట్టణంలోని పేరం పేట రోడ్డులో నివాసం ఉంటున్న తన చెల్లెలు రిబ్కా ఇంటి వద్దనే ఉంటుంది. ఇదిలా ఉండగా సంధ్యారాణి చెల్లెలు రిబ్కా ముండూరుకు చెందిన స్వరూప్ అనే వ్యక్తితో సహజీవనం సాగిస్తున్నది. ఈ నెల 28 రాత్రి రిబ్కా, స్వరూప్‌లు ఇంటివద్ద గొడవ పడుతుండగా సంధ్యారాణి అడ్డువెళ్ళింది. దీంతో స్వరూప్ కోపంతో సంధ్యారాణి జుట్టు పట్టుకుని బ్లేడుతో మెడపై, గొంతుపై బలంగా కోశాడు. తీవ్ర రక్త స్రావం కావడంతో స్థానికులు ఆమెను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 29 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి గురువారం మృతి చెందాడు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన మేరుగు జాను (42) ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. ఈనెల 24వ తేదీన కొవ్వలిలోని ఒక శుభకార్యానికి హాజరైన భోజనం అనంతరం తన బులెట్‌పై ఆశ్రం ఆసుపత్రికి డ్యూటీకి వస్తూ జాతీయ రహదారిపై నుంచి సర్వీసు రోడ్డులోకి వస్తుండగా ఇసుక పైకి ఎక్కి జారిపడిపోయాడు. తీవ్ర గాయాలకు గురైన అతనిని ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

రైలు కిందపడి పెయింటర్ ఆత్మహత్య

భీమవరం క్రైం, ఆగస్టు 29 : విజయవాడ నుంచి నర్సాపురం వెళ్ళే పోస్ట్ పాసింజర్ రైలు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ రమణ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి రైలు కింద మృతదేహం ఉన్నట్లుగా సమాచారం అందిందని తెలిపారు. వీరవాసరం మండలం కొణితివాడ గ్రామానికి చెందిన దుండి చంటిబాబు (54)గా గుర్తించామని అతను పెయింటింగ్ పని చేస్తుంటాడని తెలిపారు. ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడనేది తెలియాల్సి ఉందని తెలిపారు. బంధువులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

2న మెగా రక్తదాన శిబిరం


రక్తదాన శిబిర పోస్టర్లను ఆవిష్కరించిన బొలిశెట్టి రాజేష్

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 29 డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబరు రెండో తేదీన పట్టణంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు బొలిశెట్టి రాజేష్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక మాగంటి కల్యాణ మండపం వద్ద నిర్వహించే శిబిరంలో వెయ్యి యూనిట్లకు పైగా రక్తాని సేకరించాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నామన్నారు. జనసైనికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, గట్టు గోపికృష్ణ, నీలపాల దినేష్, సజ్జా సుబ్బు, కేశవభట్ల విజయ్ , ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం మారినా.. పోలీస్ రాజ్యం మారలేదు'

ఆకివీడు, ఆగస్టు 29 : ప్రభుత్వం మారినప్పటికీ పాలనా, పోలీస్ రాజ్యం తీరు మారలేదని, పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం మాదిరిగా పేదల ఇళ్లు తొలగించడంలో స్థానిక ఎమ్మెల్యే చర్యలు చేపట్టడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు జేఎన్‌వీ గోపాలన్ విమర్శించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆక్రమణలు తొలగింపునకు సీపీఎం సిద్ధమేనని. గతంలో ఆక్రమణల తొలగింపు ఘటనలపై నేటికీ కేసుల నిమిత్తం కోర్టుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. దుంపగడప వెళ్లే పంట కాల్వ నాలుగు కిలో మీటర్లు పొడవునా అనేక సంస్థలు, ఆక్వా చెరువుల వల్ల కలుషితమవుతున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యేకు కనపడకపోవడం ఆశ్చర్యకరమన్నారు. సీపీఎం నేతలు పెంకి అప్పారావు, డోకల రవితేజ, బొక్కా వర్మ, సందక సూరిబాబు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

పాలకోడేరు, ఆగస్టు 29: బాల్యవివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పీడీ సుజాత రాణి అన్నారు. గురువారం పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్, పంచాయతీ రాజ్, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులకు, సిబ్బందికి ఒక రోజు శిక్షణ తరగతులను ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమెతో పాటు ఎంపీడీవో నూకల గంగాధరరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రతీ ఒక్కరు బాల్య వివాహాల నిరోధక కమిటీలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఆకివీడు సీడీపీవో వాణీ విజయరత్నం, ఏఎస్ఐ మోహనరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, గ్రామ కార్యదర్శులు, మహిళా పోలీసులు, అంగన్వాడీ టీచర్లు, పూజా రులు, పాస్టర్లు, ముస్లిం మతపెద్దలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బదిలీలు వాయిదా వేయాలి

ఇరగవరం, ఆగస్టు 29 : వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు వాయిదా వేయాలని కోరుతూ తణుకు కార్యాలయంలో వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఉద్యోగులు, సిబ్బంది గురువారం మూడో రోజు ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేశారు. కార్యాలయం సిబ్బంది మాట్లాడుతూ పలు సమస్యలు పరిష్కారమయ్యే వరకు వాణిజ్య పన్నుల శాఖలో బదిలీల ప్రక్రియ చేపట్టకూడదంటూ ఈనెల 24న నిర్వహించిన సమావేశంలో నిర్ణయించుకున్నామన్నారు. తమ అభ్యర్థలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెంటపాడు ఎస్ఐగా స్వామి


కేసీహెచ్ స్వామి

పెంటపాడు, ఆగస్టు 29 : పెంటపాడు ఎస్ఐగా కేసీహెచ్ స్వామి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఏలూరు జిల్లా చాట్రాయి మండలంలో ఎస్ఐగా పనిచేసిన ఈయన బదిలీ పై పెంటపాడు వచ్చారు. ఇక్కడ ఎస్ఐ శీలం శంకర్ భీమవరం డీసీఆర్‌బీకి వెళ్లారు.

ఎయిడ్స్ నివారణపై విద్యార్థులకు క్విజ్ పోటీలు


విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం క్రైం, ఆగస్టు 29 : హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అదనపు డీఎంహెచ్‌వో బి. భానూనాయక్ అన్నారు. గురువారం భీమవరం ఐఎంఏ హాల్‌లో 9, 10వ తరగతుల విద్యార్థులకు జిల్లాస్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈనెల 31న ఉదయం భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి నుంచి ప్రకాశం చౌక్ వరకు మారథాన్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు, దిశా సీపీఎం మధుసూదనరావు, డీఐసీ హరనాథ్, ఏఆర్టీ కౌన్సిలర్ ప్రభాకర్, ఐసీటీసీ కౌన్సిలర్ నాగరాజు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఎంఈవో, పాజిటివ్ నెట్‌వర్క్ కముజు శ్రీను, కేవైఎస్ఎస్ వీసీ సాయి, వైఆర్‌జీకేర్ ఓఆర్‌డబ్ల్యూ శేషారాజ్యం, 15 పాఠశాలల నుంచి 30 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుమారుడు అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

ఆకివీడు, ఆగస్టు 29 : ఇంటి బయటకు వెళ్లిన తన కుమారుడు ఆనంద్ తిరిగి ఇంటికి రాలేదని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ హనుమంతు నాగరాజు తెలిపారు. ఆకివీడుకు చెందిన పాల మరియమ్మ పెద్ద కుమారుడు పదో తరగతి చదివి ఇంటి దగ్గరే ఉంటున్నాడు. ఈనెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద ఆచూకీ కానరాలేదు. గురువారం ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి : సీఐ

ఇరగవరం, ఆగస్టు 29 : విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని తణుకు రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఇరగవరం ఉన్నత పాఠశాలలో గురువారం పోక్సో చట్టం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.నాగమణి, పోలీస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిమెళ్ల వసతి గృహం పరిశీలన

పెంటపాడు, ఆగస్టు 29 : పరిమెళ్ల ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సహాయ సాంఘిక సంక్షేమశాఖాధికారి బి.రామాంజనేయరాజు, సబ్‌డివిజన్ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రొక్కాల నాగబుజ్జి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్లో వసతులపై ఆరా తీశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. వార్డెన్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి

నరసాపురం రూరల్, ఆగస్టు 29: ఎల్‌బీచర్లలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని వార్డు సభ్యులు బొడ్డు ఆశిష్‌కుమార్ డిమాండ్ చేశారు. గ్రామంలోని చెత్త సేకరణకు కేటాయించిన వాహనాలు ఇప్పటికే మూలనపడి ఉన్నాయన్నారు ఈకారణంగా గ్రామంలో రోడ్లపై చెత్త కుప్పలు పేరుకుపోయి ప్రజలు అనారోగ్యబారిన పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి చెత్త సేకరణ రిక్షాలు కేటాయించి పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలన్నారు.

ఈవ్ టీజింగ్ పాల్పడితే కఠిన చర్యలు : సీఐ


విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ కాళీచరణ్

భీమవరం క్రైం, ఆగస్టు 29 : ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని భీమవరం టూటౌన్ సీఐ కాళీచరణ్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ సిబ్బందితో కలిసి గురువారం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద వాహన తనిఖీతో పాటు ఈవ్‌టీజర్లపై దృష్టి సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, తోటి స్నేహితుల పట్ల విద్యార్థులు అసభ్యంగా ప్రవర్తించిన, ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు అరెస్టు చేస్తామని హెచ్చరించాఋరర. భీమవరం టూటౌన్ పరిధిలో గల కాలేజీల వద్ద పోలీసుల ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆకతాయిలను హెచ్చరించారు. మహిళలు, బాలికలను ఎవరైనా వేధిస్తే 94407 96634 నంబరుకు సమాచారమివ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.



భీమవరం బాలికల మునిసిపల్ హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవం.. పెంటపాడు గోయింకా ప్రభుత్వ కాలేజీలో విద్యార్థినికి ప్రశంసా పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్

దేశ భాషలందు తెలుగు లెస్స

» ఘనంగా తెలుగు భాషా దినోత్సవం » వాడవాడలా గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు

జిల్లావ్యాప్తంగా గురువారం తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మరోవైపు హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

ఇరగవరం/తణుకు, ఆగస్టు 29 : తెలుగు భాషలో ఉన్న గొప్పతనం, కమ్మదనం ఇతర భాషల్లో ఉండదని అందుకే దేశభాషలందు తెలుగు లెస్స అని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఇరగవరం టీడీపీ కార్యాలయంలో సినీ గేయ రచయిత రసరాజు అధ్యక్షతన తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రముఖులను ఎమ్మెల్యే ఆరిమిల్లి ఘనంగా సన్మానించారు. తణుకు పట్టణంలోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ యూఎల్ సుందరీబాయ్ ఆధ్వర్యంలో తెలుగు భాష వైభవం అనే అంశంపై పోటీలు నిర్వహించి విజేతలు బహుమతులు అందజేశారు.

- భీమవరం ఎడ్యుకేషన్/భీమవరం అర్బన్/భీమవరం టౌన్ : డీఎన్నార్ కళాశాలలో తెలుగు, సంస్కృతి శాఖ సంయుక్తంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. తెలుగుశాఖ అధిపతి టి.చిట్టిబాబు, తెలుగు అధ్యాపకులు యు.శ్రీరామరాజు, ఆర్.సంధ్యరాణి, పి.నరసింహరావు, డి.ప్రశాంత్‌కుమార్, పి. జానకీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు. సిగ్ని స్కూల్లో గిడుగు రామ్మూర్తి జయంతిని విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో కవి పండితులు ఇందుకూరి సత్య వెంకట లక్ష్మీపతిరాజు ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీకేజే ప్రసూన, విశ్రాంత హిందీ ఆచార్యులు పద్మ రాజు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. భీమవరం జేఎల్‌బీ బాలికల మున్సిపల్ హైస్కూల్లో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు భాషా దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 56 మంది తెలుగు సంస్కృతి సంప్రదాయాలపై చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన బుర్రకథ అందరినీ ఆలోచింపజేసింది. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు, జేఎల్‌బీ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం పీబీ శ్రీనివాస్, రచయిత కలిగోట్ల గోపాలశర్మ, ఉపాధ్యాయులు మాట్లాడారు.
- నరసాపురం టౌన్/మొగల్తూరు : నరసాపురం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో వనతి క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ముఖ్య అతిథి రాష్ట్ర మహిళ కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగాయి. ఇటీవల జిల్లా ఉత్తమ లైబ్రరీయన్ అవార్డు అందుకున్న కుమారిని, స్కూల్ పీఈటీ అధ్యాపకురాలు ఇందిరావాణిని క్లబ్ సభ్యులతో కలిసి ఘనంగా సత్కరించారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పి.రామరాజు ఆధ్వర్యంలో విద్యార్థులతో కవులు, కవయిత్రిల వేషధారణలు వేయించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
- పెనుగొండ : పెనుగొండ భాష్యం పాఠశాలలో ప్రిన్సిపాల్ అప్పారావు ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు నిర్వ హించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జోనల్ ఇన్‌చార్జి ఎ.శ్రీమన్నారాయణరెడ్డి, రాణీ రోజాజి విద్యార్థులు పాల్గొన్నారు.
- ఆకివీడు/ఉండి : ఆకివీడు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా బుద్ధుడు ఉపదేశించిన ఆనాపానసతి అనే శ్వాసక్రియ ద్వారా ధ్యానాన్ని కాళహస్తి మునిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో చేయించారు. పాఠశాల హెచ్ఎం కవిత, పీడీ నాగవేణి, పరమేశ్వరి తదితరులు ఉన్నారు. ఉండి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు గిడుడు రామ్మూర్తి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు ఈలి సుందర్శన్, కురెళ్ల శ్రీనివాస్, ఆర్. జ్ఞానకుమారి, ఎ.అరుణకుమారిలను ఘనంగా సన్మానించారు. లయన్స్ రుద్రరాజు నరసరాజు, భూపతిరాజు సుబ్బరాజు, పెన్మెత్స రంగరాజు తదితరులు పాల్గొన్నారు.
- పాలకొల్లురూరల్/పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం విద్యార్థులు తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాలికల హైస్కూల్లో హెచ్ఎం వై. ప్రభాకర శాస్త్రి ఆధ్వర్యంలో, ఛాంబర్స్ జూనియర్ కళాశాలలో రసధుని ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు నేతృత్వంలో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు నిర్వహించారు. డీఎస్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నరసాపురం వైఎన్ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకులు మధుర మురళీకృష్ణ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రవిశంకర్ అధ్యక్షత వహించారు.
- పెంటపాడు : డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇటీవల విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కవితలు, కథల పోటీలలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.
- గణపవరం : ఆంగ్ల మాధ్యమంలో చదివితేనే మంచి భవిష్యత్తు ఉంటుందనే ఆలోచన విడనాడి తెలుగు ఔన్నత్యాన్ని గుర్తించి మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నిర్మలకుమారి కోరారు. గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి నిర్వహించారు.



భీమవరం డీఎన్ఆర్ కాలేజీలో వేడుకలు
తాడేపల్లిగూడెంలో హెల్తీ రన్

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

భీమవరం ఎడ్యుకేషన్/పాలకొల్లు అర్బన్, ఆగస్టు 29 : దేశం గర్వించతగిన క్రీడాకారుడు, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ గౌరవార్థం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించడం ముదావహమని భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు అన్నారు. డీఎన్నార్ కళాశాలలో సీనియర్ డివిజన్ ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలోగురువారం జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో క్రీడాదినోత్సవం నిర్వహించారు. పాలకొల్లు పట్టణంలోని ఏఎస్ఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో, ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఆర్ భవానీ ప్రసాద్ అధ్యక్షతన కాపు క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం నిర్వహించారు.

- తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు : తాడేపల్లిగూడెం పట్టణంలోని భారతీయ విద్యాభవన్స్ ఆధ్వర్యంలో హెల్తీ రన్ నిర్వహించారు. పోలీస్ ఐలాండ్ నుంచి తాలూకా ఆఫీస్ సెంటర్, ఎస్వీఆర్ సర్కిల్ వరకు హెల్తీ రన్ నిర్వహించారు. పెంటపాడు మండలం పడమరవిప్పర్రు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పీడీ.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవ ర్యాలీ నిర్వమించారు.
- భీమవరంటౌన్ : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని రెండో పట్టణ సీఐ కాళీ చరణ్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక క్రీడా విద్యార్థుల ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం సందర్భంగా ర్యాలీనీ ఆయన ప్రారంభించారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ క్రీడా విశేషాలను వివరించారు. అనంతరం ర్యాలీ అభిరుచి రోడ్డు మీదుగా సరోవర్ రోడ్డు శ్రీరాంపురం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఉండి కేవీకేలో 'అమ్మ పేరుతో మొక్క'



ఉండి కేవీకేలో మొక్క నాటుతున్న దృశ్యం

ఉండి ఆగస్టు 29: మండలంలోని ఎన్ఆర్‌పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో 'అమ్మపేరుతో ఒక మొక్క' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌చౌహాన్, తదితర మంత్రులు, అధికారులు మొక్కలు నాటిన కార్యక్రమంలో భాగంగా ఉండి కేవీకే కూడా కార్యక్రమం ప్రారంభించి మొక్కలు నాటినట్లు కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మల్లికార్జునరావు తెలిపారు. ప్రధాని మోదీ జూన్ ఐదో తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని అమ్మపేరుతో ఒక మొక్కను నాటి గ్లోబల్ ప్రచారాన్ని ప్రారంభించారన్నారు. సెప్టెంబరు 2024 నాటికి దేశ వ్యాప్తంగా 80 కోట్లు మొక్కలు, మార్చి 2025నాటికి 140 కోట్ల మొక్కలు నాటేలా పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ తెలియజేసిందన్నారు. కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఉండి, ఆగస్టు 29: సార్వాపంటకు సంబంధించి రైతులంతా మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆకివీడు ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు సూచించారు. గురువారం యండగండిలో ఏవో బి.సంధ్య అధ్యక్షతన పొలం-బండి కార్యక్రమం నిర్వహించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గిస్తూ, మేలైన యాజమాన్య పద్ధతులైన సమగ్ర సస్యరక్షణ, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై దృష్టిపెట్టాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

ఉరదాలపాలెంలో మిషన్ శక్తిపై అవగాహన

అత్తిలి, ఆగస్టు 29 : ఉరదాలపాలెంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్త వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వనువులమ్మకు పుష్పాలంకరణ


వనువులమ్మకు పుష్పాలంకరణ

ఆకివీడు, ఆగస్టు 29 : లోక కల్యాణార్థం వనువులమ్మ అమ్మవారికి పుష్పాలతో అలంకరణ చేసి పూజలు చేశామని దేవస్థాన అర్చకుడు లంక నరసింహారావు తెలిపారు. గురువారం స్థానిక వనువులమ్మ దేవస్థానంలో వనువులమ్మకు పుష్పాలంకరణ చేశారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామికి లక్ష తులసి పూజలు

పెనుమంట్ర, ఆగస్టు 29 : శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో నూతన విష్ణు సుదర్శన సాలగ్రామ ప్రతిష్ఠ అష్టోత్తర శత కలశాభిషేక పూర్వక లక్ష తులసి పూజ, తిరుప్పావడి సేవ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం కర్రి అచ్యుతరామిరెడ్డి వెంకట లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో సప్త నదీ జలాలతో అభిషేకాలు పూజలు చేశారు అనంతరం లక్ష తులసి పూజ నిర్వహించారు. వేద పండితులు శ్రీనివాసుల శ్రీనివాసాచార్యులు తిరుప్పావడి సేవ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పులగం శుభ కార్తీక్‌రెడ్డి కావ్య పులగం కృష్ణ కళ్యాణిరెడ్డి అనూష దంపతులు 108 ఇత్తడి కలశాలతో పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్‌కు వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. తోలేటి రాంబాబు కర్రి అచ్యుతరామిరెడ్డి, చిర్ల బాలాజీరెడ్డి, కోణాల శ్రీనివాసరెడ్డి, తేతల రాజారెడ్డి, కట్టా బాలజీవన్ కుమార్ పాల్గొన్నారు.

నేడు క్షీరారామంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 29 : శ్రావణ మాసం సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం పది గంటలకు మహిళలచే సామూహికంగా వరలక్ష్మి వ్రతాలు ఏర్పాటు చేశామని ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. పూజల్లో పాల్గొనేవారు ఏవిధమైన రుసుం చెల్లించనవసరం లేదన్నారు. ప్రముఖ ధాండియా శిక్షకురాలు నంబూరి భాగ్యలక్ష్మి, దేవస్థానం నుంచి భక్తుల సహకారంతో పూజా సామగ్రి సమకూర్చుతామన్నారు.

నేడు ముత్యాలమ్మ సన్నిధిలో వరలక్ష్మీ వ్రత పూజలు

మొగల్తూరు, ఆగస్టు 29 : శ్రావణ మాసం పురస్కరించుకుని ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు గురువారం తెలిపారు. గౌరీ కుంకుమ పూజలు కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని భక్తులందరూ పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఈవో కోరారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

పెనుగొండ, ఆగస్టు 29 : విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల విద్యుత్ భారం తీవ్రంగా పెరుగుతుందని, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో 2000 సంవత్సరంలో హైదరాబాద్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన పోరాటంలో అమరులైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డిలకు సీపీఎం ఆధ్వర్యంలో జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తెలుగుదేశం కూటమిలో చంద్రబాబు నిర్ణయాలు ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. ప్రతీ ఇంటికి ప్రస్తుతం ఉన్న మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. నాయకులు షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, శీలం ఏసు పాల్గొన్నారు.

రొయ్యల హేచరీలో నాబార్డు బృందం పరిశీలన


కాజలో రొయ్యల సీడ్ ట్యాంకులను పరిశీలిస్తున్న నాబార్డు బృందం

యలమంచిలి, ఆగస్టు 29:ముంబైకి చెందిన నాబార్డు బృందం కాజ పడమర గ్రామంలోని శ్రీసాయి సంపద హేచరీని గురువారం పరిశీలించారు. నాబార్డు అధికారులు శివాన్సి, గణేష్, విషాల్, టి.అనిల్‌కాంత్ హేచరీలో అన్ని విభాగాలను సందర్శించి, రొయ్యల సీడ్ పెంచే విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాబార్డు బృందం.. హేచరీలో అవలంభిస్తున్న సాంకేతిక విధానాలు, పాటించే ప్రమాణాలు, జాగ్రత్తలు, సీడ్ పెంపకంలో ఎదురయ్యే సమస్యలు, నిర్వహణ తదితర అంశాలను హేచరీ యజమాని కొడవటి సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. హేచరీ సంస్థలకు నాబార్డు నుంచి ఎటువంటి సహకారం ఆశిస్తున్నారని అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. మత్స్యశాఖ భీమవరం ఏడీ ఎల్.ఎల్.ఎన్.రాజు, ఎఫ్‌డీవో ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆక్వా సాగులో నిబంధనలు పాటించాలి

మొగల్తూరు, ఆగస్టు 29 :అప్సడా, ఎంపెడా నిబంధనలకు అనుగుణంగా రైతులు ఆక్వా సాగు చేసుకోవడంతో పాటు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మత్స్యశాఖ ఏడీ సీహెచ్ వెంకటేశ్వరరావు సూచించారు. మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలోని ఆక్వా రైతులు, డీలర్లతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆక్వా సాగు చేసే ముందు చెరువులు తవ్వేముందు సాగు చేసుకునేందుకు అప్సడాలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దీనివల్ల సాగులో తలెత్తే సమస్యలు పరిష్కారం, రసాయనాలు మందులు, మేతలు వల్ల కలిగే నష్టాలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎంపెడా టెక్నికల్ అధికారి ఎం.దుర్గారావు, ఎంపీడీవో వి.బాబ్జిరాజు, ఎఫ్‌డీవో కె.వివేక్, మత్స్యశాఖ సహాయకులు సాగరమిత్రలు, ఆక్వా రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 29: పట్టణంలోని వల్లీమోహన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీని ఆర్డీవో శివన్నారాయణరెడ్డి గురువారం ప్రారంభించారు. నలుగురు నిరుపేదలకు బియ్యం, ఆయిల్ ప్యాకెట్లు, నిత్యావసర సరుకులు, కూరగాయలు అందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పటాన్ వల్లి, గౌరవాధ్యక్షుడు అడపా తిలక్, గొల్లేరు మోహన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'మానవత' సాయం

ఆచంట, ఆగస్టు 29 : కరుగోరుమిల్లిలో అగ్నిప్రమాదం వల్ల సర్వస్వం కోల్పోయిన కఠారి ఏడుకొండలు కుటుంబానికి ఆచంట మండల మానవత సేవా సంస్థ వారు బియ్యం, బట్టలు పలు నిత్యావసర సరుకులు గురువారం అందజేశారు. సభ్యులు కుక్కల లీలాప్రసాద్, కొల్లేపర వెంకన్నబాబు, నంబూరి అంజిబాబు, వేండ్ర శ్రీనివాస్, మానేపల్లి వెంకటేశ్వరరావు, గుండాబత్తుల ఆనంద్‌కుమార్, సర్పంచ్ బోడపాటి బుల్లియ్య, ఎం.వీర వెంకటపద్మారావు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

పెనుగొండ, ఆగస్టు 29 : మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి అన్నారు. ఐసీడీఎస్ పెనుగొండ వారి ఆధ్వర్యంలో గురువారం మహిళా శిశు సంక్షేమంపై గ్రామ పంచాయతీ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లకు మహిళా సంరక్షణ కార్యదర్శులపై ఉందన్నారు. సెక్రటరీ టి.రత్నాకరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 29 : రాష్ట్ర వ్యాప్తంగా డెంగీ, మలేరియా వంటి జ్వరాలు విస్తరిస్తున్న నేపథ్యంలో పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. గురువారం తహసీల్దార్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ సీహెచ్ సతీష్ మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులు, పారిశుధ్య లేమి తదితర కారణాల వల్ల విషజ్వరాల పాలవుతున్నారన్నారు. నాయకులు నవీన్, బి.పవిత్ర, బి.శృతి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం కమిషనర్‌గా అంజయ్య

నరసాపురం, ఆగస్టు 29: నరసాపురం మునిసిపల్ కమిషనర్‌గా ఎం. అంజయ్యను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన పుటపర్తి మునిసిపాల్టీ నుంచి బదిలీపై వస్తున్నారు. గతంలో భీమవరం మునిసిపాల్టీలో పని చేశారు. ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన డాక్టర్ వెంకటేశ్వర్లు ఒంగోలు కార్పొరేషన్‌కు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. మరోవైపు నరసాపురం మునిసిపాల్టీలో ఇంజనీరింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న ఏఈలు, డీఈలు బదిలీపై వెళుతున్నారు. ఇప్పటికే ఏఈలు ఇద్దరికి ఐదేళ్ల సర్వీసు పూర్తయింది. డీఈ విజయవాడ కార్పొరేషన్‌కు వెళుతున్నట్టు తెలిసింది.

అర్చకుడు కొమ్ము శ్రీనివాస్‌కు సత్కారం


కొమ్ము శ్రీనివాస్‌ను సత్కరించిన కమిటీ సభ్యులు

భీమవరంటౌన్, ఆగస్టు 29 : పట్టణానికి చెందిన అర్చకులు, మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌ను శ్రీవేణు గోపాల స్వామి మందిరం కమిటీ సభ్యులు ఘనంగా గురువారం సత్కరించారు. మందిర 52వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా అర్చక వృత్తిలో విశేష సేవలందిస్తున్న శ్రీనివాస్‌ను సత్కరించామని కమిటీ సభ్యులు తెలిపారు.

జ్వర పీడితులను ఆదుకోవాలి

పెనుగొండ, ఆగస్టు 29 :మలేరియా జ్వరాలతో పలు గ్రామాల్లో బాధపడుతున్న ప్రజలకు వైద్యం అందించి ఆదుకోవాలని సీపీఎం కార్యదర్శి ఎస్. వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ బి.అనిత కుమారికి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా నిర్వహించక, దోమల కారణంగా ప్రతీ కుటుంబంలో జ్వరాల బారిన పడి ప్రజలు ప్రైవేటు ఆసుపత్రిలను ఆశ్రయిస్తున్నారన్నారు. ప్రతీ 500 మంది జనాభాకు గ్రామాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి మందులు ఉచితంగా అందజేయాలన్నారు. షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, శీలం ఏసు పాల్గొన్నారు.

మాచేనమ్మ హుండీల ఆదాయం రూ.2.67 లక్షలు


హుండీల సొమ్ము లెక్కిస్తున్న భక్తులు

ఆచంట, ఆగస్టు 29 :పెదమల్లం మాచేనమ్మ హుండీల సొమ్ము ఆదాయం రూ.2,67,581 వచ్చిందని ఈవో రాము తెలిపారు. గురువారం దేవస్థానం అధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు సమక్షంలో 52 రోజులకు గాను లెక్కించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల ప్రాంతాలు

ఆచంట/భీమవరం రూరల్/పాలకోడేరు/ఆకివీడు/ఉండి/తాడేపల్లిగూడెం రూరల్/తణుకు, ఆగస్టు 29 : జిల్లాలోని పలు గ్రామాల్లో శుక్రవారం చెట్లు కొమ్మలు, ఆకుల తొలగింపు కారణంగా కరెంట్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయా మండలాల విద్యుత్ అధికారులు తెలిపారు. ఆచంట మండలంలోని ఆచంట, వేమవరం, కొడమంచిలి, కోడేరు, పెదమల్లం, వల్లూరు, భీమలాపురం, కరుగోరుమిల్లి, కందరవల్లి, అయోధ్యలంక, పోడూరు మండలంలోని వద్దిపర్రులో ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. భీమవరం మండలం చినగరువు, దిరుసుమర్రు, పల్లిపాలెం, పాతూరు, తూర్పుగూడెం, శివాలయం ప్రాంతాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, పాలకోడేరు మండలం గొరగనమూడిలో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ఆకివీడు మండలం గుమ్ములూరులో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఉండి మండలంలో ఉండి, చిలుకూరు, వెలివర్రు, మహదేవపట్నం, ఎన్ఆర్‌పీ అగ్రహారం, చెరుకువాడ, కలిసిపూడి, పెదపుల్లేరు, యండగడి, ఉణుదుర్రు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తాడేపల్లిగూడెం పట్టణంలోని పాతూరు, హౌసింగ్‌బోర్డు, కొండయ్య చెరువు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తణుకు పట్టణంలోని వేల్పూరు రోడ్డు, బ్యాంకు కాలనీ, సూర్యాలయం వీధి, కనకవర్షనగర్, బెల్లం మార్కెట్ ఏరియా, ఎస్ఎన్‌వీటీ కాలేజీ ప్రాంతం, సంత మార్కెట్ ఏరియా, ఎన్టీఆర్ పార్కు ఏరియా, వేల్పూరు రైల్వే స్టేషన్ రోడ్డు, విష్ణుప్రియ నగర్, వీరభద్రపురం ఏరియా, అత్తిలి, పాలి గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.